# భ్రష్టయోగం

'బాధాతప్త హృదయులకే ఎదుటివారి బాధలు అర్థమయ్యేది. బాధలోంచే త్యాగం పుడుతుంది' – అనే సత్యాన్ని నిరూపించారు రచయిత ఈ కథ ద్వారా.

కథ, కథనం రెండూ చెట్టపట్టాలేసుకుని చక్కగా నడిచాయి. కథకు కావల్సిన చదివించే గుణం, క్లుప్తత కలిగిన ఈ కథ చివరిలో పాఠకుడి మనసును ఆర్ద్రం చేసి ఆలోచింపజేస్తుంది.

- ఆదూరి వెంకట సీతారామమూర్తి ( విశాఖపట్నం )

ఏ కాలం నాటిదో... రావి చెట్టు –

చెట్టు చుట్టూ దిమ్మ కట్టారు. దానిమీద కూర్చునివున్నాడు రామశాస్త్రి.

పగలు ఒంటిగంట కావొస్తోంది.

ఇటు చెట్టునీడ, అటు ఆరంతస్థుల ఆఫీసు భవనం నీడ. రెండు నీడలూ పరచుకుని ఉన్నాయి. గాలి చల్లగా ఉంది.

శాస్త్రి ప్రాణానికి హాయిగా ఉంది వాతావరణం. భుజం మీద కాశీ తువాలు దిమ్మ మీద పరచుకుని ఒక కునుకు తీద్దామని ప్రాణం పీకింది శాస్త్రికి. వచ్చిన పని మనసులో మెదిలింది. కోరికని నిభాయించుకున్నాడు.

రాఘవ కళ్ళముందు మెదిలాడు. 'పని అవుతుందో, కాదో...' అనే భయం గుండెలో కదిలింది. ఎదురుగా భవన ప్రవేశ ద్వారంకేసి చూపు సారించాడు.

రాఘవ కనపడలేదు.

ఇప్పుడు ఆందోళన మొదలైంది. రాఘవ ప్రయత్నం ఏ మేరకు ఫలిస్తుందో, ఏమో? మెదడులో ఆలోచన సుడి తిరిగింది.

కూతురు మాధవి పెళ్ళి. పదో తరగతి వధువుకి ఇంటర్ వరుడు. కరెంట్ పని చేస్తాడు. కట్నం ఇరవై వేలు. కనీస లాంఛనాలు, మూడు పూటల భోజనాలు! గూట్లో రూపాయి లేదు, పేపర్ స్టాలు మీద కూడబెట్టిన సొమ్మూ లేదు.

ముహూర్తం పదిహేను రోజుల్లో కొచ్చింది. తాను చేతనైన సహాయం చేస్తానని ఇక్కడికి తీసుకొచ్చాడు రాఘవ.

తామున్న ఇల్లు అనబడే కొట్టం పక్క ఇంటి యజమాని రాఘవ, అతని భార్య సుగుణ. కష్టాలకి చెమర్చే కన్ను ఇద్దరిదీ. తమ పరిస్థితులు తెలుసు. అతనికి ఈ ఆఫీసులోనే ఉద్యోగం.

"ఈ ఆఫీసులో వెయ్యిమంది సిబ్బంది ఉన్నారు. ఇలా సహాయాలకు వచ్చేవారేం తక్కువ కాదులెండి. లంచ్ టైమ్‌లో క్యాంటీన్‌కి వచ్చే నలుగురితోనూ చెప్తాం. లిస్టు వాళ్ళ ముందు పెడతాం. అంతా వీలైనంత ఇస్తారు. మీరేమీ నామోషీ పడకండి!" అని తీసుకొచ్చాడు. ఇక్కడి కూర్చోబెట్టి వెళ్లాడు. సెక్యూరిటీ వాళ్ళకి చెప్పి ఒప్పించాడు.

రాఘవ రావాలి... చూస్తున్నాడు శాస్త్రి.

ఎవరో మరో మనిషి వచ్చాడు... శాస్త్రి ఆలోచన చెదిరింది.

వచ్చిన వ్యక్తి వయసు మళ్లినవాడే. పురోహితుడి వేషం, బట్టతల. మొహమంతా చెమట పట్టి ఉంది. ఆయాసపడుతున్నాడు. వచ్చి "హమ్మయ్యఁ..." అని గాలి పీల్చి దిమ్మమీద కూర్చున్నాడు. ఉత్తరీయం తీసి మొహం తుడుచుకున్నాడు. "ఏం పని మీద వచ్చారు?" యథాలాపంగా అడిగాడాయన.

"మావాడొకతనితో పనుండి వచ్చాను" అన్నాడు శాస్త్రి.

పేర్లు చెప్పుకున్నారు. కొన్ని క్షణాలపాటు మౌనం. ఆయన పేరు విశ్వనాథం.

"సత్యం అని మా దూరపు బంధువు. ఇందులోనే పని చేస్తున్నాడు. మా ఆవిడకి ఒక కిడ్నీ పోయింది. ఆపరేషన్ చేయించాలి. ఆఫీస్ వాళ్ళ సహాయం చేయిస్తానని చెప్పాడు. లంచ్ టైంలో రమ్మన్నాడు. నా అదృష్టం, నా భార్య శాంత అదృష్టం ఎలా ఉన్నాయో!?"

విశ్వనాథంకేసి జాలిగా చూశాడు శాస్త్రి. బాధ కలిగింది.

"పిల్లల్లేరా?" అని అడిగాడు.

విశ్వనాథం తల వంచుకున్నాడు. ఆయన కంట్లో నీరు తిరిగింది –

"అదో దురదృష్టం లెండి! సప్తర్షుల్ని కనింది నా భార్య... ఒక్కరూ భూమ్మీద బట్ట కట్టలేదు" అన్నాడు.

శాస్త్రి అప్రయత్నంగా "అయ్యో... పాపం!" అన్నాడు.

విశ్వనాథం కళ్ళొత్తుకున్నాడు. శాస్త్రికి తన పరిస్థితి గుర్తుకొచ్చింది.

నెల తక్కువగా పుట్టిన తొలి సంతానం సుబ్బారావు. అనాకారి, మానసిక వైకల్యం. శారీరక దౌర్బల్యం. ఇవి చాలవన్నట్లు 'ఫిట్స్.' దినదిన గండం పిల్లాడు. తానూ, భార్య గాయత్రి వాడి కోసం పడరాని పాట్లు పడ్డారు. 'ఫలం' దక్కలేదు. రెండోవాడు భాస్కరం. ఆ తర్వాతదే మాధవి. అయిదోఏట ఉండగా పెద్దాడు పోయాడు. కష్టపడి చదువుకున్నాడు భాస్కరం. ఎం.బి.ఏ. ఫైనాన్స్ చేశాడు. ముంబయిలో ఉద్యోగం వచ్చింది.

నాలుగేళ్ల క్రితం వెళ్లాడు. "మన కష్టాలు తీరిపోతాయి నాన్నా..." అన్నాడు- "మాధవి పెళ్ళి గురించి బెంగపెట్టుకోకండి" అని భరోసా ఇచ్చాడు.

ఈ నాలుగేళ్లల్లోనూ మళ్లీ మొహం చూపించలేదు! అడపాదడపా ఓ వెయ్యో, అయిదొందలో డ్రాఫ్ట్ వచ్చేది... అంతే!

శుష్కప్రియలూ... శూన్యహస్తాలూ! వేదన మిగిల్చాడు.

చివరికి మాధవి పెళ్ళి సంబంధం గురించి చెప్తే "శుభం!" అని ఊరుకున్నాడు.

అభిమానం చంపుకుని నోరు తెరిచి అడిగింది గాయత్రి- "డబ్బు సంగతేవిట్రా భాస్కరం?" అని.

"చూద్దాం... కానీయండి. మీ ప్రయత్నం మీరు చేయండి!" అన్నాడు.

అదిగో... ఇదీ ప్రయత్నం!

శాస్త్రికి తీరని ఆవేదన కలిగింది గుండెల్లో. కళ్ళు చెమర్చినై. విశ్వనాథానికి చెప్పుకుని బరువు దించుకున్నాడు శాస్త్రి.

ఆలోచనల్లో ఉండగానే వచ్చాడు రాఘవ.

అతన్ని చూసి ఆందోళనగా మొహం తుడుచుకుని నిలబడ్డాడు శాస్త్రి.

రాఘవ పక్కగా సత్యమూ వచ్చాడు. విశ్వనాథమూ లేచాడు. నలుగురూ క్యాంటీన్ వైపు కదిలారు. గంటలో ఆ కార్యక్రమం అయిపోయింది.

ఒక మూలగా టేబుల్ దగ్గర కూర్చున్నారు.

లిస్టులు కూడి, డబ్బుని లెక్క పెట్టారు. శాస్త్రి లిస్టులో రెండు వేలూ, విశ్వనాథం లిస్టులో పన్నెండు వందల చిల్లరా వచ్చాయి.

డబ్బు చేతికిచ్చారు రాఘవ- సత్యం.

ఇద్దరూ లేచి వెళ్లి మైసూరు బజ్జీలు, టీ తెచ్చారు. అందరూ తీసుకున్నారు.

"ఫర్వాలేదు. తరుగులో మెరుగు. వచ్చినంత వచ్చింది. మరోలా అనుకోకండి!" రాఘవ, సత్యం కలిసి మాట్లాడిన విషయం సారాంశం ఇది.

"చాలా సంతోషం!" అని కృతజ్ఞతలు చెప్పి కదిలారు విశ్వనాథం, శాస్త్రీ.

సత్యం, రాఘవా వాళ్ళ అంతస్థుల్లోకి వెళ్లారు.

శాస్త్రి, విశ్వనాథం చెట్టు కిందికి చేరారు. ఎవరి దారిన వాళ్ళు వెళ్లాలనిపించలేదు ఇద్దరికీ.

నిమిషాలు గడుస్తున్నాయి...

చల్లటి గాలి శరీరాన్ని సేద దీరుస్తోంది గానీ, మనసులు చెట్టుమీది పిట్టల్లా నస పెడుతున్నై. ఏమీ మాట్లాడుకోకుండాకూర్చోవటం ఇద్దరికీ ఇబ్బందిగానే ఉంది.

"సహాయం చేస్తామన్నారు... చేశారు. వాళ్ళిద్దరూ పాపం- మన కోసం చాలా శ్రమ తీసుకున్నారు. కానీ, అసంతృప్తీ, తాపత్రయం- యథాస్థితి. ఎవరినైనా ఇంతకంటే పీడించలేం కదా!" విశ్వనాథం మౌనచ్ఛేదనం చేశాడు.

"అసంతృప్తేం ఉంది లెండి!" అన్నాడు శాస్త్రి. శాస్త్రి ముఖంలోకి సూటిగా చూసి మాట్లాడలేకపోయాడు విశ్వనాథం. ఆరంతస్థుల భవనం కేసి చూపు నిలిపాడు.

"అంటే నా ఉద్దేశంలో, మన అవసరంతో పోలిస్తే అందింది తక్కువ అని. అంతే... ఎవర్నీ నెపమెన్నటం కాదు" అని, తనకు తానే చెప్పుకుంటున్నట్టు ఇంకా కొనసాగించాడు-

"కిడ్నీ డోనర్ దొరికాడు కదా... అని సంతోషించాను. హాస్పిటల్ ఖర్చూ, మందులూ యాభైవేలు అవుతాయట. అన్ని ఇరవులూ ఊడ్చీ, ఉన్న కొద్దిపాటి పరపతినీ ఉపయోగించుకునీ నానా అగచాట్లు పడితే ముప్ఫై రెండు వేలకి దేకించగలిగాను. చిట్లూ, గిట్లూ రద్దు చేసుకున్నాను..."

విశ్వనాథం గొంతు తడి ఆర్చుకుపోతోంది. శాస్త్రికి తెలుస్తూనే ఉంది.

"అవును. పరిస్థితి తలచుకుంటే దయనీయం అనిపిస్తూ ఉంటుందొక్కొక్కప్పుడు!" అని కంఠస్వరంలో విచారాన్ని వ్యక్తం చేశాడు శాస్త్రి. బాధ ధ్వనించాడు, సానుభూతినీ పంచాడు.

మళ్లీ మౌనంలోకి జారుకున్నారిద్దరూ.

ఇద్దరి మనసులూ పరిపరివిధాల పోతున్నాయి. ఇద్దరికీ తమ పరిస్థితి అయోమయంగా అనిపిస్తోంది. ఇద్దరి గుండెలూ నెర్రెలు విచ్చిన నేలల్లాగానే ఉన్నాయి.

అటూ ఇటూ చూపులు మార్చి, తిరిగి తీసుకొచ్చి వాటిని శాస్త్రి కళ్ళల్లో నిలిపి అన్నాడు విశ్వనాథం -

"చెబుతున్నానని ఏమీ అనుకోకండి శాస్త్రిగారూ! మీరెందుకో నా ఆత్మీయుల్లా అనిపించి మనసు విప్పుకుంటున్నాను. నాకోసం తనను తాను దహించుకున్న కొవ్వొత్తి సార్ నా శాంత. బతికీ బతకని పిల్లల్నిచ్చి ఆమెని చంపి, నేను బతికినవాణ్ణి సార్. ఇవాళ నా అసమర్థత వల్ల ఆమె మరణిస్తే దేవుడు కూడా నన్ను క్షమించడు శాస్త్రిగారూ!" విశ్వనాథం గొంతు రుద్ధమైంది. పసిపిల్లవాడిలా ఏడవసాగాడు.

శాస్త్రి మనసు కకావికలమయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. మనసులో అనేక భావనల కందిరీగలు రేగినాయి. మాధవి పెళ్ళికి ఇంతవరకూ సమకూరిన సొమ్మేమీ అంత ఎక్కువ కాదు. కట్నకానుకలు పూర్తిగా ఇవ్వకపోతే కొడుకుని పెళ్ళిపీటల మీద కూర్చోనివ్వనని ఖరాఖండీగా చెప్పేసింది అతని తల్లి!

జేబులో పైకం కవర్ని చేత్తో తడుముకున్నాడు శాస్త్రి. దీర్ఘంగా ఊపిరి పీల్చాడు. హాయనిపించింది. గచ్చపొదలా ఉన్న ఆలోచన చిక్కులెందుకనో క్షణంలో విడిపోయి నట్లయ్యింది. టక్కున లేచి నిలబడ్డాడు శాస్త్రి.

చప్పున జేబులోని కవరు తీసి విశ్వనాథం చేతుల్లో కుక్కేశాడు.

"మీ శాంతికి దీర్ఘాయురస్తు!" అని అక్కడి నుంచి గబగబా కదలి వెళ్లిపోయాడు.

విశ్వనాథం నిర్ఘాంతపోయాడు. నోట మాట రాలేదు. ఆయన పెదవులు మాత్రం ఏదో అనాలని వణుకుతున్నాయి.

మౌనం కూడా ఒక భాషే! 'దుఃఖాన్ని విభజించి పాలించు' అన్న అమ్మ మాటలని నెమరు వేసుకుంటున్నాడు!!

'సురభి' మాసపత్రిక ... జూలై ' 2010 సంచికలో ప్రచురితమైన కథ